క్లుప్తంగా

రామాలయంలో అభిషేక పూజ, హోమాలు


పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

జన్నారం: మండలంలోని రేండ్లగూడలోని రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆలయంలో అభిషేక పూజలు చేసి, హోమాలు కాల్చారు. పురోహితులు బ్రహ్మశ్రీ గొల్లపెల్లి రామనంద చార్యులు ఆధ్వర్యంలో మట్టి కలశాలకు పూజలు చేసి స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులతో రామయజ్ఞం చేశారు. రామనామస్మరణతో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నర్సరీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఉన్న సెంట్రల్ నర్సరీలో పనిచేస్తున్న మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. నర్సరీ వద్ద మంగళవారం ఆయన కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమై తాము పలుమార్లు ఫారెస్ట్ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినా, వాళ్లు కూడా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే యాజమాన్యం చొరవ చూపి కాంట్రాక్టర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకొని వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నర్సరీ కార్మికులు స్వప్న, సమ్మక్క, శారద, సుజాత పాల్గొన్నారు.

శభాష్ ప్రవీణ్


ప్రవీణ్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

జన్నారం: మానవత్వాన్ని మరిచి కన్నతల్లి కర్కశంగా పసికందును చెత్తకుప్పలో పడేయగా, ఏడుపు శబ్దం విని మానవత్వంతో చెత్తకుప్పలోకి వెళ్లి, పోలీసులకు సమాచారం ఇచ్చి పసికందు ప్రాణాలతో ఉండటానికి కారణమైన ప్రవీణ్‌ను మంగళవారం జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు భరత్‌కుమార్, జాజల శ్రీకాంత్‌రెడ్డి, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా అవకాశం ఇవ్వండి


మాట్లాడుతున్న నతానియేలు

నస్పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా తనకు అవకాశం ఇవ్వాలని ఎంపీగా పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతానియేలు విజ్ఞప్తి చేశారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో బకెట్ గుర్తుకు ఓటు వేసి, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, ఢీకొండ స్వామి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గాండ్ల సమ్మయ్య రాజీనామా



రామకృష్ణాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, రామకృష్ణాపూర్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. అనివార్య కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని కుల సంఘాలు, వృత్తి సంఘాల వారు తనను నమ్ముకుని కొంతకాలంగా తనతోనే ఉంటుండగా అధికారంలో ఉండి కూడా వారికి ఎలాంటి న్యాయం చేయలేకపోయానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వారికి న్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో బీఆర్‌ఎస్‌ను వీడి త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

ఆలయ వార్షికోత్సవం

భీమిని: కన్నెపల్లి మండలంలోని వీరాపూర్ గ్రామపంచాయతీలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆలయానికి వచ్చి మంగళవారం వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి పూసాల నరేందర్‌చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వాన బీభత్సం..!


కన్నెపల్లిలో తడిసిన వరి ధాన్యం బస్తాలు


నెన్నెల మండలం చిత్తాపూర్‌లో...


వేమనపల్లి: ఇంటిపై కూలిన వేప చెట్టు


జైపూర్: వేలాలలో రోడ్డుపై పడ్డ చెట్టు


జన్నారం: వరదలో కూరగాయల విక్రయిస్తూ...


కోటపల్లి: నాగంపేటలో తాడిచెట్టుపై పిడుగు

దండేపల్లి: బస్తాల కింద‌కు నీళ్లు రాకుండా కాల్వ తీస్తున్న రైతులు



- అకాల వర్షం.. పంటకు నష్టం
- తడిసిన ధాన్యం, నేలవాలిన వరిపొలాలు, రాలిన మామిడికాయలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

సాక్షి నెట్‌వర్క్: ఓ వైపు ఉదయం నుంచి ఎండలు.. సాయంత్రం కాగానే ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన రాళ్ల వర్షం జిల్లా వ్యాప్తంగా మంగళవారం బీభత్సం సృష్టించింది. కష్టించి పండించిన వరిధాన్యం కళ్లముందే నీళ్లపాలయ్యింది. కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్లపై, కళ్లాలపై ఆరబోసిన ధాన్యం వర్షార్పణం అయ్యింది. రైతులు పరుగున వచ్చినా, ఫలితం లేకపోవడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు పాట్లు పడాల్సి వచ్చింది. మామిడికాయలు నేలరాలాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ఈ అకాల వర్షం రైతన్నకు అపారనష్టాన్ని మిగిల్చింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి.

☞ కోటపల్లి మండలం నాగంపేట గ్రామానికి సమీపంలోని తాటిచెట్టుపై పిడుగుపడి కాలిబూడిదైంది.

☞ మందమర్రి మండలం సారంగపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం నీటిపాలయ్యింది. నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినప్పటికీ కొనుగోలు చేయలేదని పలువురు రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ఇప్పటివరకు తొమ్మిది లారీలు ప్రభుత్వం తరుపునా, మూడు ప్రైవేట్ లారీల లోడ్ ధాన్యం తరలివెళ్లింది. ఇంకా సుమారు ఇరువై లారీల లోడ్ వరకు ధాన్యం కేంద్రంలోనే ఉందని రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, తమ ఇబ్బందులు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

☞ బెల్లంపల్లిలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి విద్యుత్‌లో అంతరాయం కలిగింది. సింగరేణి, డిస్కం, కరెంట్ నిలిచిపోయింది. కార్మిక వాడలు, కార్మికేతర కాలనీలలో గంటల కొద్దీ సరఫరా ఆగిపోయింది. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ కరెంట్ పునరుద్ధరణ జరగలేదు. మందమర్రి నుంచి బెల్లంపల్లికి వచ్చే సింగరేణి విద్యుత్ లైన్ జంపర్ల వద్ద చెట్ల కొమ్మలు విరిగి పడటంతో కరెంట్ సరఫరాకు అంతరాయం జరిగినట్లు సింగరేణి ఎలక్ట్రికల్ సిబ్బంది తెలుపగా, పలు చోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడి జంపర్లు, ఇతర విద్యుత్ పరికరాలు పాడైపోయినట్లు డిస్కం అధికారులు పేర్కొన్నారు. ఏకకాలంలో సింగరేణి, డిస్కం కరెంట్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

☞ వేమనపల్లిలో పలువురి ఇళ్లపై రేకులు ఈదురుగాలులకు లేచిపోయాయి. బొగుడగూడంలో ఎల్కరి తిరుపతి ఇంటిపై వేపచెట్టు పడి ఇల్లు ధ్వంసమైంది. నలుగురు కుటుంబ సభ్యులకు ప్రాణాపాయం తప్పింది. ఇంట్లో ఉన్న ఎనిమిది కోళ్లు మృతి చెందాయి. దుబ్బుల సంజయ్ ఇంటి ఎదుట ఉన్న 40ఏళ్ల నాటి భారీ వేప చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడగా రెండు స్తంభాలు విరిగిపడ్డాయి. సల్పల రాజేష్, దేవసాని శ్రీనివాస్ ఇంటి ఎదుట చెట్లు నేలకూలాయి. 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచింది.

☞ జన్నారం మండలంలోని పొనకల్ మార్కెట్ యార్డులో ధాన్యం తూకం వేయడంలో ఆలస్యం చేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు రావడం లేదని తూకం నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూకం వేయించి రైతుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు. ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచి కూరగాయల వ్యాపారులకు ఇబ్బంది కలిగింది. వారసంత కావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. బురద నీటిలోనే కూరగాయలను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

☞ జైపూర్ మండలం వేలాల వద్ద రోడ్డుపైన చెట్లు పడ్డాయి. విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


భీమారం సమీపంలో నేలవాలిన వరి పొలం


నిలిచిన నీటిని తొలగిస్తున్న మహిళా రైతు


మందమర్రిరూరల్: తడిసిన ధాన్యం చూపిస్తూ...


హాజీపూర్ మండలం టీకానపల్లిలో...


జైపూర్‌లో తడిసిన ధాన్యాన్ని కుప్ప చేస్తూ...


కోటపల్లిలో తడిసిన ధాన్యం వద్ద రైతు


భీమారం: కవర్లపై నిలిచిన నీటిని తొలగిస్తూ..

ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం


దండేపల్లి: మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు


జన్నారంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్


బూర్గుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

- కాంగ్రెస్‌కు ఓటేయండి
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, వినోద్, వివేక్

దండేపల్లి/భీమారం/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/చెన్నూరురూరల్/భీమిని/కాసిపేట/మందమర్రి రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. పెద్దపల్లి లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమారం మండలంలోని బూర్గుపల్లి, దాంపూర్, కాజిపల్లి, ఎలకేశ్వరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కన్నెపల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రంగారావు, బెల్లంపల్లి రాంనగర్ బస్తీకి చెందిన శ్యామ్ బీఆర్‌ఎస్ యువజన పట్టణ ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామకృష్ణాపూర్‌లోని బీజోన్ శ్రీనివాసనగర్, ఇందిరానగర్‌లలో మాజీ ఎమ్మెల్సీ, కార్మిక నేత వెంకట్రావ్ ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేపట్టారు. మందమర్రిలో ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. చెన్నూర్ మండలం పొన్నారంలో జిల్లా కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు హఫీజ్, కాసిపేట మండలంలోని పెద్దనపల్లి పాతబస్తీలో యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనుకుల రాకేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో దండేపల్లిలో ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, యూత్ మండల అధ్యక్షుడు దుర్గప్రసాద్, భీమారంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, పార్టీఅధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు పాడేటి రవి,కొత్త సత్తిరెడ్డి,బుక్యా లక్ష్మణ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ కోసం బీజేపీని గెలిపించాలి


బీజేపీలో చేరిన చెన్నూర్ పట్టణ యువకులు

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికలలో దేశ భవిష్యత్ కోసం బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ అన్నారు. బెల్లంపల్లి అగర్వాల్ భవన్‌లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మంగళవారం ఎస్టీ మోర్చా సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎంపీ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేస్తున్న గోమాసే శ్రీనివాస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎస్టీ మోర్చా శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పు సురేందర్, పార్లమెంట్ కో కన్వీనర్ అజ్మీర శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు గోనె శ్యాంసుందర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో భారీ చేరికలు

చెన్నూర్: స్థానిక మాజీ ఉప సర్పంచ్ సద్ది శ్రీనివాస్, నాయకులు బొజ్జ పోశం, దాసరి రాజన్న మరో 60మంది యువకులు మంగళవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతుందన్నారు. దేశ భవిష్యత్ బీజేపీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వరగౌడ్, చేరికల కమిటీ కన్వీనర్ బత్తుల సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు గర్రెపెల్లి నర్సయ్య, పట్టి కృష్ణ తదితరులు ఉన్నారు.

నియామకం

జైపూర్: మండల బీజేపీ అధ్యక్షులుగా నర్వ గ్రామ తాజామాజీ సర్పంచ్ దుట రాజ్‌కుమార్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు.

వేమనపల్లి: మండల బీజేపీ అధ్యక్షుడిగా నీల్వాయికి చెందిన ఏట మధుకర్ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ పెద్దపల్లి నియోజకవర్గ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మధుకర్‌కు నియామకపు పత్రం అందజేశారు.

దేవుళ్ల మీద దొంగ ప్రమాణాలు ప్రజలు నమ్మరు

- మంచిర్యాల బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


పాతమంచిర్యాలలో ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/కాసిపేట: కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చాక, వాటిని అమలు చేయకుండానే సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేసి దొంగ ప్రమాణాలను చేస్తున్నారని, సీఎం మాటలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పాతమంచిర్యాలలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పెద్దపల్లి ఎంపీగా పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, వార్డు అధ్యక్షుడు వేముల గురువయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. కాసిపేట మండలంలోని గుర్వాపూర్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు.

'బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి'

జన్నారం: రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్ పాలనతోనే సాధ్యమని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సక్కును గెలిపించాలని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వారసంతలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంగడిబజార్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, నాయకులు పాల్గొన్నారు.

శివాలయ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: కృష్ణ కాలనీలోని శివాలయం నూతన ఆలయ కమిటీని ఆలయ ఆవరణలో మంగళవారం ఎన్నుకున్నారు. నూతన గౌరవధ్యక్షులుగా బరుపటి తిరుపతి, అధ్యక్షులుగా కొల్లూరి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా బూర శ్రీనివాస్, కోశాధికారిగా బద్రి శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

సన్మానం

పాతమంచిర్యాల: నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్‌కు ఆ సంఘం నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో సన్మానం చేశారు.

న్యాయవాది మృతి

సంక్షిప్త వార్తలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాలక్ష్మి వాడకు చెందిన వేల్పుల తిరుమలేష్ (40) న్యాయవాది అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. విధులకు మంగళవారం గైర్హాజరయ్యారు. కోర్టు ఆవరణలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడికొప్పుల కిరణ్‌కుమార్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పనివేళలు మార్పించాం

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో ఎండ తీవ్రత యాజమాన్యంతో మాట్లాడి పనివేళలు మార్పించామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఓపెన్ కాస్ట్ గనిలో పనివేళలు మార్చాలని తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పలుమార్లు సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి చర్చించారని, ప్రభుత్వంతో యాజమాన్యంపై ఒత్తిడి తెప్పించారన్నారు. ఈ మేరకు యాజమాన్యం మార్పు చేసిందని తెలిపారు.

నెన్నెలలో పోలీసుల కవాతు



నెన్నెల: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మేము ఉన్నామని భరోసా, మనోధైర్యాన్ని నింపేందుకు కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు నెన్నెలలో మంగళవారం కవాతు నిర్వహించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగించినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైలారంలో ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నెన్నెలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై ప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.